క్లుప్తంగా

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

కేతేపల్లి: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గ్రాడ్యుయేట్లు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కేతేపల్లి తహసీల్దారు ఎస్.మధుసూదన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో ఓటర్లుగా నమోదైన వారు కూడా మరలా నూతనంగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. 2020 నవంబర్ 1 నాటికి డిగ్రీ ఉత్తీర్ణులైన వారు మాత్రమే ఓటు హక్కుకు అర్హులను తెలిపారు. డిగ్రీ సర్టిఫికెట్, ఓటరు ఐడీ, ఆధార్, అడ్రస్ ప్రూఫ్, పాస్‌పోర్టు సైజు ఫొటోతో ఫిబ్రవరి 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో ఓటుహక్కు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆఫ్‌లైన్‌లో ఓటుహక్కు నమోదు చేసుకోవాలనుకునే ఫారం–18 ద్వారా తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న గ్రామస్తులు

శాలిగౌరారం: మండలంలోని వల్లాల గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన శెట్టిపల్లి రాంరెడ్డి కుటుంబానికి గ్రామానికి చెందిన యువకులు, స్నేహితులు, గ్రామస్తులు అంతా కలిసి రూ.1.37 లక్షల ఆర్థిసాయాన్ని ఆదివారం అందజేశారు. నిరుపేదలు కావడంతో పాటూ తల్లిదండ్రులను కోల్పోయిన కుమార్తెలు అనాథలుగా మిగిలారు. వారి కుటుంబ పరిస్థితిని చూసి చలించిన గ్రామానికి చెందిన కొంతమంది యువకులు వాట్సాప్ గ్రూపు ద్వారా సేకరించిన నగదును రాంరెడ్డి కుమార్తెలకు అందజేశారు.

సీపీఐ నాయకుడు మృతి



నగదు అందజేస్తున్న నాయకులు

మర్రిగూడ: మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు ఈద పెదనరసింహ ఆదివారం మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని సీపీఐ మండల కార్యవర్గ సభ్యుడు ఆకుల రఘుమయ్య సందర్శించిన పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి సీపీఐ నాయకులు ఆకుల వెంకట్రామ్, బండి శేఖర్‌గౌడ్ రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో బండి జహంగీర్, ఈద మారయ్య, తన్నీరు యాదయ్య, జాల వెంకటయ్య, పాలకూర జంగయ్య, వడ్డెమాన్ వెంకటయ్య, బడేటి పెద్దయ్య, పాపయ్య, జర్పుల రామరాజు, జాల వెంకటయ్య ఉన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు నిర్ణయం హర్షణీయం

నల్లగొండటౌన్: మున్నూరుకాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించడం హర్షణీయమని మున్నూరు కాపు మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు ఆవుల రాములు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేయడం వల్ల మున్నూరు కాపులకు ఉపాధి అవకాశాలు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



నగదు అందజేస్తున్న స్నేహితులు

నార్కట్‌పల్లి: మండలంలోని తొండల్‌వాయి గ్రామానికి చెందిన మేడిపల్లి వెంకన్న ఇటీవల మృతిచెందాడు. ఆయనతోపాటు 2000–01 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న స్నేహితులు ఆదివారం వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.68,611 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసాగర్, నరేష్, సైదులు, బాబు, గిరి, కరుణాకర్, మల్లారెడ్డి, ఆంజనేయులు, వెంకట్‌రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకటేశం

నల్లగొండటౌన్: చేనేత కార్మిక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను చేనేత జౌళిశాఖ అడిషనల్ డైరెక్టర్ వెంకటేశం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, చేనేత జౌళి శాఖ అధికారులు తస్మా, పద్మ, చంద్రశేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు పొగతో అవస్థలు



జాతీయ రహదారి పక్కన చందనపల్లి వద్ద చెత్త డంపింగ్ యార్డు



వ్యర్థాలను తగులబెడుతున్నప్పుడు వెలువడుతున్న పొగ

- ఉక్కిరిబిక్కిరి అవుతున్న గ్రామస్తులు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- డంపింగ్ యార్డు తొలగించాలని చందనపల్లి వాసుల డిమాండ్

నల్లగొండ రూరల్: చందనపల్లి గ్రామ సమీపాన ఉన్న మున్సిపల్ చెత్త డంపింగ్ యార్డు నుంచి వచ్చే పొగతో గ్రామస్తులు, వాహనదారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నల్లగొండ మండలంలోని చందనపల్లి గ్రామం నుంచి 565వ నంబర్ జాతీయ రహదారిని ఇటీవల నూతనంగా నిర్మించారు. నకిరేకల్ నుంచి చందనపల్లి–నల్లగొండ పట్టణంలోని సాగర్ రోడ్డును కలుపుతూ డబుల్ రోడ్డు ఏర్పాటు కావడంతో ఈ రోడ్డుపై వాహనాల రద్దీ అధికమైంది.

చందనపల్లి వద్దకు రాగానే..

నకిరేకల్ వద్ద జాతీయ రహదారి నుంచి సాగర్ వైపు వెళ్లే వాహనాలన్నీ చందనపల్లి–నల్లగొండ 565 రోడ్డు నుంచి వెళుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు, ఇతర వాహనదారులు వివిధ పనుల నిమిత్తం నల్లగొండకు, సాగర్ వైపు ఈ రోడ్డుపై ప్రయాణిస్తుంటారు. అయితే చందపల్లి సమీపంలోకి రాగాగే అక్కడ ఏర్పాటు చేసిన నీలగిరి మున్సిపల్ డంపింగ్ యార్డు నుంచి వచ్చే పొగతో వాహనదారులు శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందులు పడతున్నారు. చెత్త డంపింగ్ యార్డు నుంచి వెలువడే పొగ చుట్టుపక్కల కిలోమీటర్ వరకు వ్యాపిస్తుండడంతో రైతులు సైతం వ్యవసాయ పనులు చేయడం ఇబ్బందిగా మారింది. సమీప రైతులు పొలాల్లో పని చేసే సమయంలో శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు. కూలీలు వ్యవసాయ పనులకు సైతం రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాత్రి సమయాల్లో వాహనదారుల అవస్థలు

డంపింగ్ యార్డులో చెత్తను దగ్ధం చేయడంతో అక్కడ నిల్వ చేసిన వ్యర్థ పదార్థాల నుంచి వెలువడే పొగతో వాహనదారులు, గ్రామస్తులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పొగ కారణంగా రాత్రి సమయంలో జాతీయ రహదారి కనిపించడం లేదు. పొగ పూర్తిగా రోడ్డును కమ్మేయడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. పొగకు తోడు రోడ్డుపైన కుక్కలు గుంపులుగా ఉంటుండడంతో వాటి బారి నుంచి తప్పించుకోవడం వాహనదారులకు ప్రాణ సంకటంగా మారింది. డంపింగ్ యార్డు వద్ద లైట్లు ఉన్నప్పటికీ పొగవల్ల రోడ్డు సరిగ్గా కనిపించడం లేదు. పందులు, కుక్కలు డంపింగ్ యార్డులో వ్యర్థాలు తిని 600 గ్రామాలకు తాగునీరు అందించే పానగల్ ఉదయ సముద్రం చెరువులో సేద తీరుతున్నాయి. ఫలితంగా నీరు కలుషితమవుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనారోగ్యం బారిన గ్రామస్తులు

డంపింగ్ యార్డు ప్రభావం చందంపల్లి గ్రామంలోని 800 కుటుంబాలపై పడుతోంది. ఇంట్లో ఉన్న ఆహార పదార్థాల పాత్రలపై బూడిద పేరుకుపోవడంతో తినే ఆహారం సైతం కలుషితమవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామం వైపే పొగ పూర్తిగా వస్తుండడంతో శ్వాస పీల్చుకోవడం ఇబ్బంది అవుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్వాసకోశ వ్యాధులతోపాటు గైనిక్ సమస్యలతో మహిళలు మరింత ఇబ్బంది పడుతున్నారు.

హామీ నెరవేరేనా..

చెత్త డంపింగ్ యార్డు తొలగించిన వారికే ఓట్లేస్తామని ఎన్నికల సమయంలో నాయకులకు గ్రామస్తులు తేల్చి చెప్పారు. ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలో చెత్త డంపింగ్ యార్డు తొలగించి గ్రామస్తులకు ఇబ్బంది లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి ఇచ్చిన హామీ ఎప్పుడు నెరవేరుతుందోనని గ్రామస్తులంతా ఎదురు చూస్తున్నారు.

మంత్రి హామీ ఇచ్చారు



“చెత్త డంపింగ్ యార్డును తొలగిస్తానని ఎన్నికల సమయంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారు. పొగ కారణంగా గ్రామస్తులంతా అనారోగ్యం పాలుకావడంతో పాటు వచ్చి పోయే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. త్వరలో మంత్రి హామీ నెరవేరుస్తారని ఎదురు చూస్తున్నాం.

–మణెమ్మ, గ్రామ సర్పంచ్, చందనపల్లి

పొగతో రోడ్డు కనిపించడం లేదు



“చెత్త డంపింగ్ యార్డు నుంచి వచ్చే పొగ కారణంగా 2 కి.మీ. వరకు రోడ్డు కనిపించడం లేదు. రోడ్డుపై కుక్కలు, పందులు ఉండడంతో ప్రమాదాల బారిన పడుతున్నాం. చీకటి అయితే ఈ రోడ్డు మార్గంలో రావాలంటే భయపడాల్సిన పరిస్థితి. శ్వాస పీల్చేటప్పుడు ఇబ్బంది అవుతోంది.

–తంతెనపల్లి శివ, గ్రామస్తుడు

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధం కావాలి



జెండా ఎగురవేస్తున్న మాజీ ఎంపీ నర్సయ్య

చిట్యాల: త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. చిట్యాల మండలం నేరడ గ్రామంలో ఆదివారం బీజేపీ జెండాను ఆయన ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ భారతీయుల బంగారు భవిష్యత్ కోసం రాబోయే ఎన్నికల్లో మరోమారు బీజేపీని గెలిపించాలని కోరారు. పార్టీ విజయానికి పనిచేసే ప్రతి నాయకుడికి, కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం వికసిత్ భారత్ క్యాలెండర్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డితో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ మైల నర్సింహ, కో కన్వీనర్ మాదురి ప్రభాకర్‌రావు, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు పాపని వజన వాసుదేవ్, పార్టీ మండల అధ్యక్షుడు పొట్లపల్లి నర్సింహగౌడ్, నాయకులు గంజి గోవర్ధన్, వరికుప్పల నర్సింహ, పొట్టబత్ని గోపాలకృష్ణ, పొట్టబత్ని శ్రీను, మిర్యాల మోహనకృష్ణ, కూరెళ్ళ శ్రీను, గుండాల నరేష్‌గౌడ్, అంశల అనిల్‌కుమార్, కన్నెబోయిన మహాలింగం, మాస శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నక్కలగండి సొరంగ మార్గాన్ని పూర్తిచేయాలి



మునుగోడు: మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

మునుగోడు: నక్కలగండి సొరంగ మార్గాన్ని వెంటనే పూర్తిచేసి మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు సాగు నీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మునుగోడులోని పార్టీ కార్యాలయంలో జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గ్రామాల్లో బెల్టు షాపులను మూసివేయించడం హర్షణీయమని, అందుకు ప్రతి సీపీఐ కార్యకర్త, నాయకుడు పూర్తి సహాయ, సహకారాలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తిరిపారి వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు దుబ్బ వెంకన్న, ఎండీ జానీ, రేవెల్లి అంజయ్య, కుమర్తి ముత్తయ్య, చాపల విప్లవ్, బెల్లం శివయ్య తదితరులు పాల్గొన్నారు.

రసాయన పరిశ్రమల నిర్మాణాన్ని ఆపాలి

గట్టుప్పల్ (చండూరు): గాలి నీరు పర్యావరణాన్ని కలుషితం చేసే రసాయనిక పరిశ్రమలను గ్రామాల్లో నిర్మించకుండా ఆపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం గట్టుప్పల్ మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఐ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గట్టుప్పల్, మునుగోడు మండలం కృష్టాపురం గ్రామాల్లో రసాయనిక పరిశ్రమలు ఏర్పాటుచేస్తున్నారని అన్నారు. ఇప్పటికే చౌటుప్పల్‌లో ఉన్న పరిశ్రమల వల్ల ప్రజలు అనేక రకలుగా వ్యాధులతో సతమతమవుతున్నారని, ఈ ప్రాంతమంతా కాలుష్యం ఏర్పడి వ్యవసాయానికి పనికి రాని భూములుగా మారిపోయే ప్రమాదం ఉన్నదన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్లపురాజు రామలింగయ్య, మండల కార్యదర్శి భీమనపల్లి రమేష్‌సు సహాయ కార్యదర్శి రాపోలు సత్తయ్య, చేనేత సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు ధనుంజయ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సుధాకర్ రెడ్డి, పెంటయ్య, మండల కార్యవర్గ సభ్యులు ఐతరాజు లక్ష్మయ్య, లింగస్వామి, పెద్ద యాదయ్య, కట్ట చెన్నయ్య పాల్గొన్నారు.

రసాయన వ్యర్థాలు వదిలే వారిపై చర్య తీసుకోవాలి



గుండ్రాంపల్లి శివారులో వ్యర్థాలను వదిలిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

చిట్యాల: రసాయన పరిశ్రమల నుంచి వెలువడుతున్న ప్రమాదకర వ్యర్థాలను జాతీయ రహదారుల పక్కన ఉన్న చెట్ల వెంబడి, చెరువుల్లో వదిలి వెళుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు బొడిగె సైదులుగౌడ్, చిట్యాల మండల సహాయ కార్యదర్శి జిల్లా సత్యం డిమాండ్ చేశారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ శివారులోని రహదారి పక్కన వ్యర్థ రసాయనాలను వదిలి వెళ్లిన ప్రాంతాలను ఆదివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్ధ రాత్రి సమయాల్లో ట్యాంకర్ల ద్వారా వ్యర్థ రసాయనాలను తీసుకువచ్చి వదిలి వెళుతున్నారన్నారు. దీనివల్ల చెట్లు ఎండిపోవడంతోపాటు చెరువుల్లోని నీరు కలుషితం అవుతోందన్నారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తగిన చర్యలు తీసుకుని రసాయన వ్యర్థాలను వదిలి వెళుతున్న ముఠాపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుండ్రాంపల్లి సీపీఐ గ్రామశాఖ సహాయ కార్యదర్శి కేతరాజు అంజయ్య, సీమ అంజయ్య, జిల్లా యాదయ్య, సర్గాల అశోక్, బొడిగె లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్యశిబిరంలో పాల్గొన్న డాక్టర్ కంచర్ల హరీష్

కట్టంగూర్ : గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జనరల్ ఫిజిషియన్, క్యాన్సర్ స్పెషలిస్ట్ కంచర్ల హరీష్ అన్నారు. సాందీపని ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి కంచర్ల హరీష్ ఆధ్వర్యంలో ఆదివారం కట్టంగూర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 350 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం హరీష్ మాట్లాడుతూ బీపీ, షుగర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఫిజీషియన్ మాధవాచారి, గైనకాజిస్ట్ హబిత, హెచ్‌ఎం రాములు, మాజీ ఎంపీపీ రెడ్డిపల్లి వెంకటమ్మ సాగర్, కానుగు లింగయ్య, రెడ్డిపల్లి శంకర్, మేడి రాంబాబు, జి యాదగిరి, ఎం. సంపత్, మద్దెల శంకర్ ఉన్నారు.

కౌండిన్య గౌడ సంఘం జిల్లా కన్వీనర్‌గా శ్రీనివాస్‌గౌడ్

మిర్యాలగూడ టౌన్: కౌండిన్య గౌడ సంఘం నల్లగొండ జిల్లా కన్వీనర్‌గా మిర్యాలగూడ పట్టణానికి చెందిన యడవెల్లి శ్రీనివాస్‌గౌడ్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం సంఘం జాతీయ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది కేఎల్‌ఎన్ ప్రసాద్ చేతులమీదుగా ఆదివారం నల్లగొండలో ఆయన నిమామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా యడవెల్లి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి, గీత కార్మికుల అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎన్నికల్లో మద్యం, డబ్బుకు దూరంగా ఉంటాం



ప్రమాణం చేస్తున్న వెల్మకన్నె గ్రామస్తులు

గట్టుప్పల్ (చండూరు) : వచ్చే స్థానిక సంస్థల (సర్పంచ్, ఎంపీటీసీలు) ఎన్నికల్లో మద్యం, డబ్బులకు దూరంగా ఉంటామని గట్టుప్పల మండల పరిధిలోని వెల్మకన్నె గ్రామస్తులు గ్రామ చౌరస్తాలో ప్రమాణం చేశారు. ఆదివారం ఆ గ్రామ యువజన సంఘం, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామస్తులు సమావేశమయ్యారు. ఎన్నికల్లో ఎవరైనా పోటీ చేయవచ్చు కానీ మద్యం, డబ్బులను ఓటర్లకు పంపిణీ చేయడం నిషేధిస్తున్నట్లు తీర్మానం చేశారు. పోటీ చేసిన వ్యక్తులు ఎవరైనా ఒకవేళ డబ్బులు, మద్యం పంపిణీ చేసినట్లు రుజువైతే ఊరిలో వారిని దోషిగా నిలబెట్టేందుకు నిర్ణయం తీసుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న మమత స్కూల్ పూర్వ విద్యార్థులు

నల్లగొండ టూటౌన్: పట్టణంలోని మమత స్కూల్ విద్యార్థులు ఆదివారం ఓ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీన సమ్మేళనం నిర్వహించారు. 1995–96 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు అందరు ఒకేచోట చేరి అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎండీ. సయ్యద్, కంది కపిల్‌ప్రసాద్, రామకృష్ణ, వెంకటరమణ, చింతపల్లి లింగమయ్య, పరమేశ్, గోవర్ధన్, రేణుక, నయీమ్, శ్రీను, స్వప్న, అన్నపూర్ణ, శ్రీలత, కవిత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో కళావేదిక నిర్మాణం



చొల్లేడు ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్మించిన కళావేదిక

మునుగోడు: మండలంలోని చొల్లేడు గ్రామ ప్రాథమిక పాఠశాలలో కళావేదికను ఆ గ్రామ సర్పంచ్ జనిగల మహేశ్వరిసైదులు తన సొంత డబ్బులు రూ. లక్ష 40వేల వ్యయంతో నిర్మించారు. తన మామ ముత్తయ్య జ్ఞాపకార్థం మంచి పనిచేయాలనే ఆలోచనతో విద్యార్థులకు అవసరమైన కళావేదిక నిర్మించానని జనిగల మహేశ్వరి తెలిపారు. కళా వేదిక నిర్మించిన సర్పంచ్‌ను గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందిస్తున్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ టౌన్: మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేఎస్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎనిమిది గంటలకు గాను 14 గంటల పాటు పని చేయిస్తున్నారని, ఓటీని కేవలం రెండు గంటలకే చెల్లించడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. మహిళలు అదనపు గంటలు విధులను నిర్వహించడం వలన అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఆయన వెంట రీజినల్ సెక్రటరీ సుధాకర్, పగిళ్ల కృష్ణయ్య, వినయ్‌కుమార్, రాములు, జానయ్య, రాంరెడ్డి తదితరులున్నారు.

ఆధార్ నమోదుకు తప్పని తిప్పలు

- మూడు నెలలుగా మర్రిగూడలో అందని సేవలు
- పక్క మండలాలకు వెళ్లి నమోదు
- రోజుల తరబడి నిరీక్షణ



మర్రిగూడలో మూతబడిన ఆధార్ సెంటర్

మర్రిగూడ: ప్రస్తుతం ప్రతి ఒక్కరికి ఆధార్‌కార్డు ముఖ్యమైన గుర్తింపు కార్డు అయింది. ఆధార్‌కార్డు పొందేందుకు, లేదంటే ఏదైనా తప్పులు సవరించుకునేందుకు ఆధార్ కేంద్రాల్లోనే సాధ్యమవుతుంది. కానీ దాదాపు మూడు నెలలు దాటినా మర్రిగూడలో ఆధార్ సేవలు అందుబాటులో లేక ప్రజల తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

లెంకలపల్లి కేంద్రం వయోజనులకే ..

మర్రిగూడ మండలంలోని 18 గ్రామపంచాయతీలు, 19 ఆవాస ప్రాంతాల్లో 2011 జనాభా లెక్కల ప్రకారం 33,021 మంది జనాభా ఉన్నారు. మర్రిగూడ మండల కేంద్రంలో రెండు ఆధార్ సెంటర్లు ఉన్నాయి. మీసేవ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ మర్రిగూడ తహసీల్దార్ కార్యాలయంలో ఉంది. ఈ కేంద్రంలో సాంకేతిక సమస్యల కారణాలతో కొన్ని నెలలుగా పూర్తిగా సేవలు నిలిచిపోయాయి. సీఎస్‌సీ ద్వారా పొందిన మరొక ఆధార్ సెంటర్ లెంకలపల్లిలో ఉంది. ఇక్కడ వయోజనుకుల మాత్రమే ఆధార్ అప్‌డేట్ చేస్తున్నారు. చిన్న పిల్లలకు ఆధార్ కావాలన్నా, సవరణలు చేయాలన్నా చండూరుకు పంపిస్తున్నారు.

పొరుగు మండలాలకు వెళ్లాల్సిందే...

మర్రిగూడ మండల కేంద్రంలోని ఆధార్ సెంటర్ లేకపోవడంతో పొరుగు మండలాలైనా నాంపల్లి, చండూరు, గట్టుప్పల, చింతపల్లితోపాటు ఇతర మండలాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఆయా మండలాల్లోని ఆధార్ సెంటర్ల వద్దకు ప్రజలు తెల్లవారుజామునే చేరుకోవాల్సి వస్తుంది. అక్కడ వారు అందించే టోకెన్లు పొందితే ఆ రోజు పని పూర్తవుతుంది. లేదంటే మరుసటి రోజు వెళ్లి నిరీక్షించక తప్పదు. రోజుల తరబడి పనులు వదిలేసుకుని వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని దినసరి కూలీలు ఆందోళన చెందుతున్నారు. ఇదే అదనుగా భావించిన నిర్వాహకులు ఆధార్ నమోదు, సవరణకు రూ.150 నుంచి రూ.250 వరకు వసూలు చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

విద్యార్థులే అధికం...

ఆధార్ అప్‌డేట్ చేసుకోవడానికి కేంద్రాల వద్ద విద్యార్థులే అధికంగా కనిపిస్తున్నారు. ఎందుకంటే వారు విద్యనభ్యసిస్తున్న వసతి గృహాల నుంచి సెలవుల్లో మాత్రమే ఇంటికి వస్తుంటారు.సెలవుల్లో ఆధార్ అప్‌డేషన్ పూర్తికాకపోవడంతో పాఠశాలకు సకాలంలో చేరుకోలేకపోతున్నారని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. మర్రిగూడ మండల కేంద్రంలోని ఆధార్ సెంటర్‌ను సక్రమంగా పనిచేసే విధంగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రోజంతా మీ సేవ కేంద్రం వద్దే ఉండాల్సి వచ్చింది



“మర్రిగూడలో ఆధార్ సెంటర్ పనిచేయకపోవడంతో నా కుమారుడి నూతన ఆధార్ కార్డు కోసం నాంపల్లి మండలానికి ఉదయం వెళ్లి సాయంత్రం వరకు రోజంతా అక్కడే ఉండాల్సి వచ్చింది. టోకెన్లు పొందని వారు మరుసటి రోజు వెళ్లాల్సిందే. ప్రయాణం, సమయం రెండు వృథా అవుతున్నాయి. మర్రిగూడ మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ ఉంటే ఇబ్బందులు ఉండవు.

–సిలివేరు రఘు, మర్రిగూడ

గట్టుప్పల్ మండలంలో అప్‌డేట్ చేశాం



“మా ఇద్దరి పిల్లల ఆధార్ అప్‌డేట్ కోసం లెంకలపల్లిలో వీలు కాకపోవడంతో గట్టుప్పల్ మండలంలో అప్‌డేషన్ చేయించాను. ఒకరికి రూ.150 చొప్పున తీసుకోవడంతోపాటు ద్విచక్ర వాహనంపై వెళ్తే అదనంగా పెట్రోల్ ఖర్చులు కూడా అయ్యాయి. మర్రిగూడ మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ ఉంటే అదనపు ఖర్చులు తగ్గుతాయి. అధికారులు ఆధార్ సెంటర్‌ను అందుబాటులోకి తేవాలి.

– మేతరి రాములు, మేటిచందాపురం

వారంలోగా ఆధార్ సెంటర్‌ను అందుబాటులోకి తెస్తాం



“మర్రిగూడ మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ పనిచేయడం లేదు. ఈ విషయానిన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారంలోపు సమస్యను పరిష్కరించి ఆధార్ సేవలను అందుబాటులోకి తెస్తాం. మండల ప్రజలు అత్యవసర సేవలు అవసరమైతే లెంకలపల్లి ఆధార్ సెంటర్ సేవలను పొందవచ్చు.

– బి. శ్రీనివాసులు, తహసీల్దార్, మర్రిగూడ

నిరుపయోగంగా జనరేటర్



కేతేపల్లి తహసీల్దార్ కార్యాలయం వెనుక వృథాగా ఉన్న జనరేటర్

కేతేపల్లి: విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు వీడియో కాన్ఫరెన్స్, ఆన్‌లైన్ పనుల నిర్వహణకు ఆటంకం కలగకుండా 2010 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.2లక్షల విలువైన జనరేటర్‌ను స్థానిక తహసీల్దారు కార్యాలయానికి సరఫరా చేసింది. అయితే దాని నిర్వహణకు డీజిల్, ఇతర ఖర్చులపై అధికారులకు ఎలాంటి స్పష్టత లేకపోవడంతో అప్పటి నుంచి కార్యాలయం వెనుక భాగంలో వృథాగా పడవేశారు. జనరేటర్‌ను ఏళ్ల తరబడి ఉపయోగించకపోవడంతో అందులోని విలువైన విడిభాగాలు తుప్పుపట్టిపోతున్నాయి. అధికారులు స్పందించి జనరేటర్‌ను వినియోగంలోకి తీసుకువచ్చినట్లయితే వీడియో కాన్ఫరెన్స్‌లతోపాటు ధ్రువపత్రాలు అందజేసేందుకు ఆటంకం ఉండదని స్థానికులు పేర్కొంటున్నారు.

పీఆర్‌టీయూ అధ్యక్షుడిగా గురజాల ధనయ్య

చండూరు : పీఆర్‌టీయూ నూతన కమిటీని ఆదివారం చండూరులో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చండూరు మండల అధ్యక్షుడిగా గురజాల ధనయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కె.ఇమామ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా గోపయ్య, సహాయ కార్యదర్శిగా కర్నాటి రమేష్, కోశాధికారిగా వనం భిక్షపతి, అసోసియేట్ కార్యదర్శిగా రామగిరి శ్రీను ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయులకు యూనియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.